



అనంతపురంలో నిరసన ప్రదర్శన చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా జనంపై కొత్త భారం వేస్తోంది. వచ్చే నెల 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ల ఫీజును పెంచుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని పాలనాపరమైన ఉత్తర్వులను ఆయా శాఖల అధికారులకు అందించింది. భూములు, స్థలాలు, ఇళ్ల క్రయ, విక్రయాలపై రిజిస్ట్రేషన్ల భారం పడనుంది. కమర్షియల్ ఏరియాకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అదనపు ఛార్జీలు కొనుగోలుదారులు చెల్లించాల్సి ఉంది. నూతన పాలసీప్రకారం భూముల విలువ 10 నుంచి 15 శాతం పెరగనుంది. కొత్త ఏడాది నుంచి పెంచిన రిజిస్ట్రేషన్ ఛార్జీలు అమల్లోకి రానున్నాయి.





'కొత్త' భారం..!



- ప్రజలపై రిజిస్ట్రేషన్ల ఛార్జీల వడ్డన
- రియల్ ఎస్టేట్‌పై తీవ్ర ప్రభావం
- ఇప్పటికే ఛార్జీల భారం అదనం అంటున్న వ్యాపారులు

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ ప్రాంతాలతో పాటు, పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న మండలాల్లో భూముల క్రయవిక్రయాలు భారీగానే జరుగుతుంటాయి. ముఖ్యంగా అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, హిందూపురం, ధర్మవరం, కదిరి, పెనుకొండ తదితర ప్రాంతాల్లో భూముల విలువ భారీగానే ఉన్నాయి. వీటి పరిధిలో రియల్ ఎస్టేట్ రూపంలో అమ్మకాలు కూడా జోరుగానే జరుగుతుంటాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు పట్టణాలు, గ్రామాల్లో ఒకే సారి కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు అమల్లోకి రానుంది. గత ప్రభుత్వ విధానంలో మాదిరిగా భూముల రిజిస్ట్రేషన్లలో అసమానతలు లేకుండా చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. నిర్ణయం ఏదైనా జనంపై మాత్రం భారం తప్పడం లేదు. భూముల రిజిస్ట్రేషన్లతో పాటు, భవన నిర్మాణాల విలువను కూడా పెంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచనున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలోని దాదాపు అన్ని భూములపై 10 నుంచి 15 శాతం ఛార్జీలు అదనంగా పెరగనున్నాయి.

15 శాతం పెంపుదల ఇలా..

ప్రస్తుతం ఎకరా ధర రూ.22 లక్షలు ఉంటే ఆ భూమిని బయట వ్యక్తులకు విక్రయిస్తే రిజిస్ట్రేషన్ ఫీజు 7.5 శాతం అంటే రూ. 1.65 లక్షలు వసూలు చేస్తారు. రాబోయే కాలంలో ప్రభుత్వం 15 శాతం భూమి విలువ పెంచితే ఈ ప్రాంతంలో ఎకరాకు అదనంగా రూ. 3.30 లక్షలు చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అప్పుడు ఎకరా విలువ రూ.25.30 లక్షలు అవుతుంది. ఈ విధంగా చూస్తే దీనిపై రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఎకరానికి రూ.1,89,750 అవుతుంది. అంటే రిజిస్ట్రేషన్ చెల్లిస్తున్న దాని కంటే ఎకరానికి అదనంగా రూ.24,750 కట్టాల్సి ఉంది. రూ.50 లక్షలు విలువైన ప్లాట్ కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్ ఛార్జీలు రూ.4 లక్షలు. ఇప్పుడు దాని విలువ 30 శాతం పెరిగితే రిజిస్ట్రేషన్ చార్జీలు అదనంగా రూ.2.50 లక్షలు అంటే రూ.6.50 లక్షలు కట్టాల్సి వస్తుంది. రూరల్ ప్రాంతంలో రూ.30 లక్షల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ప్రస్తుతం రూ.2.40 లక్షలు అవుతుండగా, అవి 2 లక్షలకు పెరగనున్నాయి. ఇలా అన్ని చోట్లా భూముల విలువను బట్టి రేట్లు భారీగా పెరగనున్నాయి.



క్రయ,విక్రయాలపై ప్రభావం

ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ నేపథ్యంలో కొందరు వారి ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు పొలాలు, స్థలాలను అమ్మకాలు చేస్తుంటారు. రిజిస్ట్రేషన్ల ఛార్జీలు తరచూ పెరుగుతూ పోతుండడం ఈ ప్రభావం భూముల క్రయవిక్రయాలపై పడుతోతంది. రిజిస్ట్రేషన్ల ఛార్జీల భారంతో అమ్మకాలు బాగా తగ్గిపోతాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం రిజిస్ట్రేషన్ల ఛార్జీల పెంపుతో మరింత పతనం అవుతుందని వారు భావిస్తున్నారు. కరోనా ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రియల్ ఎస్టేట్ రంగం ఛార్జీల పెంపు నిర్ణయంతో కుప్పకూలిపోయే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. భూముల విలువ, రిజిస్ట్రేషన్ల ఛార్జీల పెంపు నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోరుతున్నారు.

సాధారణ కార్యాలయంలా రిజిస్ట్రేషన్ శాఖ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రిజిస్ట్రేషన్ శాఖలో కొత్త మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ కూర్చొనే కుర్చీ, అక్కడి పరిస్థితిని పూర్తిగా మార్చివేసింది. ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో సబ్‌రిజిస్ట్రార్లు న్యాయమూర్తుల తరహాలో కూర్చొనే విధానానికి స్వస్తి పలికి సాధారణ అధికారి వల్లే కుర్చీ, టేబుల్‌ను ఉంచే ఏర్పాటు చేశారు. ఫ్రెండ్లీ రిజిస్ట్రేషన్ల కోసం ఈ పద్ధతి తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలియజేస్తోంది.

అమిత్‌షా వ్యాఖ్యలపై..

భగ్గుమన్న వామపక్షాలు

- జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు
- మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై వామపక్ష పార్టీలు భగ్గుమన్నాయి. మంత్రి పదవి నుంచి ఆయన్ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన తెలిపి అమిత్‌షా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమిత్‌షా కేంద్ర మంత్రిగా ఉంటూ పార్లమెంట్ సాక్షిగా 'అంబేద్కర్..అంబేద్కర్.. అంబేద్కర్... ఇన్ని సార్లు దేవున్ని స్మరిస్తే స్వర్గం ప్రాప్తిస్తుంది' అని మాట్లాడిన తీరు అత్యంత హేయమైన చర్య అన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తాం.. పున:సమీక్ష చేస్తామని బిజెపి చెబుతున్న మాటల్లో భాగంగానే అంబేద్కర్‌పై ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేసినట్లు ఉందన్నారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నా ప్రధాని మోడీ కనీసం నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని వామపక్ష పార్టీల నాయకులు స్పష్టం చేశారు.

వార్త 6లో

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఒ ఎ.మాలోల, డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, శిరీష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి 306 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంపై ఆయా శాఖల జిల్లా అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రాధాన్యత పరంగా ఎప్పటికప్పుడు పరిష్కారాలు చూపాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఇప్పటి వరకు జిల్లాలో మొదటి మూడు స్థానాల్లో అగ్రికల్చర్, పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్ ఉన్నాయాన్నరు. మిగితా శాఖల కూడా ఈ మేరకు కృషి చేయాలన్నారు. ప్రాథమిక సహకార సంఘాల సభ్యుల ఈకేవైసీ ప్రక్రియను మంగళవారం లోపు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఏ.మాలోల, సిపిఒ అశోక్ కుమార్, జడ్పి సిఈవో ఆర్.రామచంద్ర రెడ్డితో పాటు జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జనవరి 1 తేదీన నూతన ఆంగ్ల సంవత్సరం కావడంతో ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంగళవారం నాడు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ప్రారంభం కావాలన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు అవకాశం లేకుండా వంద శాతం పంపిణీ కార్యక్రమం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీని జిల్లా కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించనున్నట్లు తెలియజేశారు.

కె.భానుప్రియకు డాక్టరేట్

ప్రజాశక్తి-అనంతపురం



అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సుదీర్ఘ పరిశోధనలో భాగంగా తిరుపతి జిల్లా తిరుచానూరుకు చెందిన పరిశోధక విద్యార్థి కె.భానుప్రియకు సోమవారం అనంతపురం జెఎన్‌టియు యూనివర్సిటీలో డాక్టరేట్ ప్రదానం చేశారు. జెఎన్‌టియు ఆచార్యులు కె.హేమచంద్రారెడ్డి పర్యవేక్షణలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో 'మల్టీ డిమెన్షనల్ మోడలింగ్ అఫ్ ది ఇన్ -సిలిండర్ ఫ్యూయల్ స్ప్రేస్ కంబుషన్, ఎమిషన్ ఫార్మషన్ ఇన్ డిఐ డీజిల్ ఇంజిన్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు కె.భానుప్రియకు డాక్టరేట్ ప్రధనం చేసింది.

చిరుతకు పంచనామా

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి కన్నేపల్లి రహదారి పక్కన ఓ వ్యవసాయ రైతు పొలంలో మృతిచెందిన చిరుత పులికి జిల్లా అటవీ శాఖ అధికారి విగ్నేష్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ మధుబాషా, సెక్షన్ ఆఫీసర్ షానుజ్ ఆధ్వర్యంలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతులు ఆదివారం సాయంత్రం ఓ చిరుత మృతిచెందినట్లు గమణించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు సోమవారం ఉదయం పశువైద్యాధికారి నవీన్‌కుమార్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతిచెందిన చిరుతకు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం చిరుత కలేబరాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సుమారు ఐదేళ్ల వయస్సు ఉన్న మగ చిరుత మూడు రోజుల క్రితమే మరణించి ఉంటుందని తెలిపారు.



చిరుత కలేబరానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశు వైద్యాధికారి నవీన్‌కుమార్

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి-రాయదుర్గం




రాయదుర్గంలో విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సీనియర్ న్యాయవాది బివి.శేషాద్రి మృతికి నిరసనగా సోమవారం రాయదుర్గంలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కోర్టు బయట న్యాయవాదులు నిరసన ప్రదర్శన చేపట్టారు. సోమ, మంగళవారం కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు అనంతపురం త్రీటౌన్ సిఐ చర్యలపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్.జాన్సన్, ప్రధాన కార్యదర్శి ఇసి.వన్నూరుస్వామి, సంయుక్త కార్యదర్శి కె.పృథ్వీరాజ్, సీనియర్ న్యాయవాదులు, ఎన్‌సి.శ్రీనివాసన్, బికె.విజయరావు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

తాడిపత్రి : సీనియర్ న్యాయవాది బివి.శేషాద్రి మృతికి నిరసనగా తాడిపత్రిలో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ అనంతపురంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాది శేషాద్రిని నిర్బంధించి నానా బూతులు తిట్టడంతోనే మనస్థాపాన్ని గురై చనిపోయారని వాపోయారు. వెంటనే బాధ్యతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజులరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు దద్దం సుబ్బయ్య, మునయ్య, ఆర్‌సి రజనీకాంత్‌రెడ్డి, శివయ్య, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

31న మద్యం దుకాణాలు బంద్ చేయించండి : ఐద్వా

ప్రజాశక్తి-గుంతకల్లు



సిఐ మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా మహిళలు

నూతన సంవత్సర దినోత్సవ వేడుకల సందర్భంగా ఈనెల 31వతేదీ రాత్రి మద్యం దుకాణాలను బంద్ చేయించాలని ఐద్వా నాయకురాళ్లు డిమాండ్ చేశారు. ఈమేరకు ఐద్వా మహిళా సంఘం నాయకురాళ్లు సోమవారం 1వ పట్టణ సిఐ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు ఈనెల 31వతేదీ రాత్రి ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసి వేసి విచ్చలవిడిగా వాహనాలను నడిపే ప్రమాదం ఉందన్నారు. అంతేగాకుండా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవారు ఉంటారన్నారు. వీటన్నిటికీ ప్రధాన కారణం మద్యం అన్నారు. కావున 31వతేదీన మద్యం దుకాణాలను పూర్తిగా బంద్ చేయించడంతోపాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారిల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్షులు బి.జ్యోతి, కార్యదర్శి బి.రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు లక్ష్మీబాయి, షాకీరా, వై.లక్ష్మి, వై.ఆదిలక్ష్మి, హేమ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

2, 3న విద్య, వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

విద్యార్థుల్లోని విద్యావైజ్ఞానిక నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఎపి ఎస్‌సిఇఆర్‌టి పాఠశాల విద్య డైరెక్టర్, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వచ్చేనెల 2, 3వతేదీల్లో జిల్లాస్థాయిలో విద్య వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు డిఇఒ ప్రసాద్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి బాల మురళీకృష్ణ సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ యజమాన్యంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు తయారు చేసిన సైన్స్, గణితానికి చెందిన ప్రాజెక్టలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

డ్రగ్స్‌ను నివారించి..నవ సమాజాన్ని నిర్మిద్దాం

ఆవిర్భావ దినోత్సవంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్

ప్రజాశక్తి-గుంతకల్లు



గుంతకల్లులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

డ్రగ్స్‌ను నివారించి నవ సమాజాన్ని నిర్మిద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక పొట్టి శ్రీరాములు కూడలి నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్టీఆర్ కూడలి వరకూ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970లో కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో భగత్ సింగ్, అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో ఎస్ఎఫ్ఐ ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజమే లక్ష్యంగా అందరికీ విద్య ఉపాధి కల్పించాలని విద్యార్థులను చైతన్య పరుస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ప్రస్తుత కాలంలో దేశం, రాష్ట్రంలో విద్యాహక్కులను కాలరాసే విధంగా రాజకీయ పరిణామాలు జరుగుతున్నాయన్నారు. దేశంలో ఉన్న కూటమి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చిందని దాన్ని దాని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జీవో 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించే విధంగా చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న 3,480 కోట్ల వసతిదీవెన, విద్యాదీవెన, బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాబోవు రోజుల్లో తమ విద్యార్థి సంఘం బలపడే విధంగా పోరాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, సహాయ కార్యదర్శి భీమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగిశివ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు ఆవుల మనోహర్, మాజీ నాయకుడు కుమార్‌నాయక్, ఎస్ఎఫ్ఐ నాయకులు పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.అశోక్‌రెడ్డి, వెంకటేశులు, ఎస్ఎఫ్ఐ నాయకులు వలి, అనిల్, గణేష్, భానుప్రకాష్, దేవరాజ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని గార్లదిన్నె మండలం పెనకచెర్ల మిడ్‌పెన్నార్ జలాశయంలో పిఎంఎంఎస్వై పథకం కింద చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం మత్స్యకారులపై నిర్లక్ష్యంగా వ్యవహరించి ఒదన్నారు. గతంలో 8 లక్షలు చేప పిల్లలను వదిలితే, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సాయంతో కూటమి ప్రభుత్వం తరపున 12 లక్షల చేప పిల్లలను జలాశయంలో వదిలినట్లు తెలిపారు. తద్వారా 350 మత్స్యకారులు కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందన్నారు. అంతేగాకుండా గత టిడిపి హయాంలో చేప పిల్లలతోపాటు పట్టే వలలు, చిన్నపాటి పడవలు, ఇతర పనిముట్లను అందజేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు.




చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు

దళారులను నమ్మి మోసపోవద్దు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం





కానిస్టేబుల్ అభ్యర్థుల ఐరీష్, దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ జగదీష్

నగరంలోని నీలం సంజీవరెడ్డి మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థులకు సోమవారం దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఆయా పరీక్షలను ఎస్పీ పి.జగదీష్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ ప్రక్రియ యావత్తు సాంకేతిక పరిజ్ఞానంతో జోడించి నిర్వహిస్తుండడంతో పూర్తి పారదర్శకంగా కొనసాగుతోంది. అభ్యర్థులు మైదానంలోకి అడుగు డింది మొదలు తిరిగి బయటికి వెళ్లేంత వరకూ ఆయా విభాగాల సిబ్బంది పకడ్బందీగా పక్కాగా విధులు నిర్వర్తిస్తున్నారు. అభ్యర్థులకు మొదటగా సర్టిఫికెట్లను పరిశీలించారు. తర్వాత బయోమెట్రిక్ తీసుకున్నారు. తదనంతరం ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్ మెంట్స్ నిర్వహించారు. అనంతరం పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పారదర్శకంగా పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు సాగుతున్నాయన్నారు. అభ్యర్థుల ప్రతిభ, సామర్థ్యం ఆధారంగానే ఉద్యోగం వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అత్యంత అధునాతన టెక్నాలజీని వినియోగించి సిసి కెమేరాల పర్యవేక్షణలో ఇక్కడ దేహదారుఢ్య పరీక్షల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని ఎవరైనా మోసపు మాటలు చెప్పినా, ఆశ్రయించినా అలాంటి వారి సమాచారాన్ని వెంటనే డయల్ -100 లేదా సమీప పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు డివి.రమణమూర్తి, ఇలియాజ్‌బాషా, జిల్లాలోని డీఎస్పీలు, పలువురు సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, ఐటి కోర్ టీం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

మనువాదాన్ని ప్రోత్సహించేలా ఆయన వ్యాఖ్యలు
అంబేద్కర్, రాజ్యాంగాన్ని విమర్శించినా ప్రధాని నోరుమెదపడా..?
అమిత్ షా, ప్రధాని మోడీపై వామపక్షాల ఆగ్రహం
జిల్లావ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

రాజ్యాంగా నిర్మాత డా॥బిఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయించాలని డిమాండ్ చేశారు.

అనంతపురం కలెక్టరేట్ : అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. జెడ్పీ హాల్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం నుండి టవర్ క్లాక్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకుడు జి.ఓబులు, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ తదితరులు హాజరై మాట్లాడారు. అంబేద్కర్‌ను అవమానకరంగా పార్లమెంట్ సాక్షిగా అమిత్ షా దూషించడం అత్యంత హేయమైన చర్య అన్నారు. బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రిగా ఉంటూ అమిత్ షా పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానిస్తూ మాట్లాడడం రాజ్యాంగాన్ని అవమానించడమే అన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తాం, పున్ణసమీక్ష చేస్తామని బిజెపి చెబుతున్న మాటల్లో భాగంగానే అంబేద్కర్‌పై ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేసినట్లు ఉందన్నారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నా ప్రధాని మోడీ కనీసం నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. బిజెపి ప్రభుత్వం రానున్న కాలంలో కార్పొరేట్ శక్తులకు సంపదను మరింత దోచిపెట్టేందుకు ప్రజాస్వామ్య విలువలకు పాతరేస్తోందన్నారు. నియంతత్వ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి జమిలి ఎన్నికల పేరుతో ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రమైన ప్రయత్నం చేస్తోందన్నారు. కార్పొరేట్ల విజన్‌ను అమలు చేసేందుకు బిజెపి చేస్తున్న కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అమిత్ షా తన రాజకీయ ఆర్‌ఎస్‌ఎస్ మనస్తత్వానికి అనుగుణంగా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానపరిచాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, హక్కులు లేకుండా చేయాలనే ఉద్దేశంతో హోంమంత్రి మనువాద సంస్కృతిని ప్రజల్లోకి జొప్పించే కుట్ర చేస్తున్నారన్నారు. ఈ మనువాద విష సంస్కృతిని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. అమిత్‌షా రాజీనామా చేసేంత వరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు నాగరాజు, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ముర్తుజా, ఆర్‌వి.నాయుడు, చంద్రశేఖర్ రెడ్డి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, మల్లికార్జున, నగర కార్యదర్శి శ్రీరాములు, పద్మావతి జయమ్మ, సిపిఎం నగర కమిటీ సభ్యులు ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, ఓబులేసు, లతీఫ్, ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

రాయదుర్గం : భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సిపిఐ తాలూకా కార్యదర్శి నాగార్జున ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దుర్గన్న హనుమంతు, నాగిరెడ్డి, ఎపి రైత సంఘం అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తిప్పేస్వామి, ఏఐవైఎఫ్ రాయదుర్గం తాలూకా అధ్యక్షుడు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్‌లో వామపక్షాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ, సిపిఎం మండల



రాయదుర్గంలో నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు


తాడిపత్రిలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

కార్యదర్శులు డి.పెద్దయ్య, సూరి మాట్లాడుతూ అమిత్‌సా వెంటనే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు పెద్దిరాజు, పెద్దయ్య, ఓబుళపతి, భాస్కర్‌రెడ్డి, పెద్దన్న, నాగభూషణం, శివ, కుళ్లాయప్ప, దేవరాజు, ఆదినారాయణ, నారాయణ, నాగముని, రామాంజి, నారాయణమ్మ, యేసురత్నం, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పట్టణంలోని యల్లనూరు రోడ్డు నుంచి బస్టాండ్ సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్‌రెడ్డి, సిపిఎం నాయకులు నరసింహారెడ్డి, ఉమాగౌడ్, రామ్మోహన్, సిపిఐ నాయకులు రంగయ్య, పూసల సంఘం చంటి, నాగరాజు, భజన కుళ్లాయప్ప, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలో కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, సంజీవరెడ్డి, వెంకటకొండ, సిఐటియు నాయకులు నాగేంద్ర, చెన్నప్ప, పూసి, చంటి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే పదవికి రాజీనామా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొండారెడ్డి, రామాంజనేయులు, శ్రీనివాసులు, కుళ్లాయిస్వామి, నాగేంద్ర, రాజేష్, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉరవకొండ, వజ్రకరూరు, కూడేరు మండల కేంద్రాల్లో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్, వజ్రకరూరు మండల కన్వీనర్ విరూపాక్షి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి, ఎంఆర్‌పిఎస్ నాయకులు లక్ష్మన్న, సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, కౌలు రైతుసంఘం జిల్లా నాయకులు పెద్దముష్టూరు వెంకటేశులు, రైతుసంఘం నాయకులు జ్ఞానమూర్తి, సిద్ధప్ప, సీనప్ప, మురళీ, వినోద్, వీరాంజనేయులు, వెంకటేశులు, సిపిఎం మండల నాయకులు కరీం, వెంకటేసులు, ఈశ్వరయ్య, అక్కలప్ప, రామక్క, అరుణమ్మ, సిపిఐ మండల నాయకులు రమణ, అంజనప్ప, మల్ల రాయుడు, ఎంఆర్‌పిఎస్ నాయకులు లక్ష్మన్న, రాజు, వెంకటేశులు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు సంజప్ప, కాంగ్రెస్ మండల కన్వీనర్ నారాయణస్వామి యాదవ్, సిఐటియు నాయకులు సుధాకర్, బెంజిమెన్, ఎంపి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : వామపక్షాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ సర్కిల్‌లో రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు గంగాధర్, పి.నారాయణస్వామి, చాపల రామాంజి, నాగరాజు, సుధాకర్, పెద్ద పెద్దయ్య, నారాయణప్ప, సూరి, తిరుపతమ్మ, పార్వతమ్మ, జేరినా, అల్తాఫ్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలో వామపక్షాల నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి లోకేష్, మండల కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, పార్టీ సభ్యులు సోమలాపురం గంగాధర్, రుద్రముని, సురేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని మొలకలమూరు రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ వామపక్షాల నాయకులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి లక్ష్మీబజార్ వరకూ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, సభ్యులు మధు, తిమ్మరాజు, అంజి, నాగేంద్రనాయక్, కృష్ణానాయక్, తిప్పేస్వామి, ఆంజనేయులు, ఓబులేష్, బాబు, హనుమంతు, రమేష్, శంకర్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు వంశీ పాల్గొన్నారు.

రాప్తాడు : అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, సిపిఎం నాయకులు రామకృష్ణ, టి.రామాంజనేయులు, పోతులయ్య, సిపిఐ నాయకులు ఎం.చలపతి, వామపక్షాల కార్యకర్తలు హరీష్, హాజారా, ప్రమీలాదేవి, యుగేంధర్‌రెడ్డి, నరసింహులు, అక్కులప్ప, గోవిందు, నగేష్, పొన్నారెడ్డి, ధనుంజయ, మధు, వన్నూరుస్వామి, సుబ్బారావు, వెంకట్రాముడు, సుబ్బిరెడ్డి, బ్రహ్మయ్య, పుష్పరాజు, రాజు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి పార్టీల ఆధ్వర్యంలో సోమవారం ప్రధాన రహదారి నుంచి మహాత్మా గాంధీ విగ్రహం, అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యవర్గ సభ్యులు జగ్గిలి రమేష్, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సాకె నాగరాజు, కసాపురం రమేష్, రంగమ్మ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు జిలాన్, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మహేష్, మండల కార్యదర్శి రాయల్ రాము, నాయకులు గౌస్, రామాంజనేయులు, సురేష్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు జిలాన్, మహబూబ్ బాషా, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు జ్యోతి, జాకీర్, ఓబులేసు, షాషా, సూరి, లక్ష్మీబాయి, ఖాదర్, ఈరన్న, ఐద్వా మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పామిడి : వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఎద్దులపల్లి సర్కిల్లోని అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, మండల కార్యదర్శి మల్లేష్, శివకుమార్, బాబా ఫకృద్దీన్, లోకేష్, నాగరాజు, శంకర్, ముత్యాలు, చంద్రమోహన్ రెడ్డి, ఈశ్వరయ్య,నాగరాజు, చౌడప్ప, రాముడు, సిపిఐ జిల్లా కార్యదర్శి రహీం, సూర్య నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని గాంధీ కూడలిలో సిపిఎం, ప్రజాసంఘాలు, బీఎస్పీ, మాల మహానాడు ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం, మాల మహానాడు జిల్లా నాయకుడు ఎం.రామాంజనేయులు, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, సిపిఎం నాయకులు బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మద్దిలేటి, మహిళా సంఘం నాయకురాలు కవిత, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు


వివరాలు తెలుసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

గురుకుల పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రసాద్ ఆదేశాల మేరకు బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు గ్రామంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హాస్టల్‌లోని బోధన, బోధన వసతులు, ప్రభుత్వ కార్యక్రమాలు, విద్యార్థుల హాజరు పట్టిక, పరిసరాల పరిశుభ్రత, నిత్యావసరాల భౌతిక నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ ఎం.నాగభూషణం, సిఐ ఎస్.జమాల్‌బాషా, ఎఐ జె.వాసుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమాకు నేటితో గడువు పూర్తి

ప్రజాశక్తి-పుట్లూరు

పప్పుశనగ పంటకు బీమా ప్రీమియం చెల్లించుకునేందుకు మంగళవారం ఆఖరి గడువు అని మండల వ్యవసాయ శాఖ అధికారిణి కాత్యాయిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున రైతులు ఎకరాకు రూ.450 చొప్పున చెల్లించి బీమా చేసుకోవాలని కోరారు

అంటరానితనం నేరం

ప్రజాశక్తి-బొమ్మనహాల్



మాట్లాడుతున్న తహశీల్దార్ మునివేలు

ప్రస్తుతం సమాజంలో అంటరానితనం నేరమని తహశీల్దార్ మునివేలు అన్నారు. సోమవారం మండలంలోని బండూరు దళితవాడలో పౌరహక్కుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అంటరానితనానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపోతే ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా రోగాలు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నబిరసూల్, మాజీ ఎంపిటిసి అప్పారావు, విఆర్ఓ నాగరాజు, విఆర్ఎ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

మిత్రుల ఆపన్నహస్తం

ప్రజాశక్తి-నార్పల



ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మిత్రుడు పుల్లయ్య కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆపన్నహస్తం అందించారు. మండల కేంద్రంలోని ఉయ్యాలకుంట కాలనీకి చెందిన తలారి పుల్లయ్య రెండు కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ చేయించుకుంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. విషయం తెలుసుకున్న 2002-03లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి సోమవారం రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన మరో మిత్రుడు సుబ్రమణ్యంను పరామర్శించి రూ.20వేలు వైద్య ఖర్చులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలదాతకు సన్మానం

ప్రజాశక్తి-కుందుర్పి

మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు ఐదెకరాల భూమిని దానం చేసిన పామలాతి గంగమ్మ ప్రశంసనీయమని ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయభాస్కర్ కొనియాడారు. ఈమేరకు సోమవారం స్థానిక పాఠశాలలో స్థలం దాత గంగమ్మ ఇంటికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ పాఠశాలకు ఐదెకరాల భూమి దానం ఇచ్చి చాలామందికి ఆదర్శంగా నిలిచారన్నారు. స్థలం ఎంతో విలువైంది అయినప్పటికీ పేద పిల్లలు సంతోషంగా చదువుకోవాలనే మంచి సంకల్పంతో దానం చేశారన్నారు. ఆమె త్యాగం ఎన్నో తరాలు గుర్తు చేసుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధు, హరీష్‌కుమార్, మాజీ సర్పంచి పెద్ద నరసింహప్ప, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, మంగ్లీ చెరువు సంఘం అధ్యక్షుడు రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు లోకేష్, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్, బసప్ప, పి.పరమేష్, పి.శరత్, లక్ష్మణమూర్తి, శ్రీనివాసులు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


స్థల దాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆర్ఎంఎస్ ఉద్యోగుల దీక్షకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-గుంతకల్లు


దీక్షలకు మద్దతు తెలుపుతున్న సిఐటియు నాయకులు

పోస్టల్ శాఖలోని ఆర్ఎంఎస్ (రైల్వే మెయిల్ సర్వీసు)లను మూసివేయకుండా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు సిఐటియు నాయకులు సోమవారం సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు వివిఎల్ నరసింహులు, పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు మాట్లాడుతూ పోస్టల్ శాఖలోని ఆర్ఎంఎస్ విభాగాలు దేశవ్యాప్తంగా 310పైగా ఉన్నాయన్నారు. అయితే ఆర్ఎంఎస్ విభాగాలను మూసివేయాలని ఇటీవల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీంతో ఆర్ఎంఎస్ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు ప్రమాదం ఏర్పడినదన్నారు. బ్రిటీష్ కాలం నుంచి దేశ ప్రజానీకానికి అందుబాటులో సౌకర్యవంతంగా సేవలందిస్తున్న ఆర్ఎంఎస్‌ను మూసివేయడం సరైంది కాదన్నారు. ఆర్ఎంఎస్ మూసివేసి ఆలోచన ఉపసంహరించుకోవాలని, ఆర్ఎంఎస్ ఉద్యోగ సంఘాలు చేస్తున్న పోరాటాలకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. భవిష్యత్తులో వారి ఆందోళనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన

ప్రజాశక్తి-ఉరవకొండ


పూలు, పండ్లు అమ్ముతూ నిరసన తెలుపుతున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన డబ్బులు విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతురాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు పెండింగ్ డబ్బులు చెల్లించడంతోపాటు జీవో 77ను రద్దు చేయాలని కోరుతూ పట్టణంలోని టవర్‌క్లాక్ సర్కిల్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట పూలు, పండ్లు అమ్ముతూ వినూత్నంగా నిరసన తెలిపారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు జీవో 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సుల్తాన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మంజునాథ్, వంశీ, జిల్లా సహాయ కార్యదర్శి చందు, నియోజకవర్గ కోశాధికారి రాజు, ఉపాధ్యక్షులు లెనిన్, రాజేష్, నియోజకవర్గ నాయకులు సాగర్, రాజేష్, లాలుస్వామి, జగదీష్, సాదిక్, నిరంజన్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-గుత్తి


సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ ఎన్.ఢిల్లేశ్వరి

బాల్య వివాహాలను అరికడదామని సిడిపిఒ ఎన్.ఢిల్లేశ్వరి, ఎసిడిపిఒ ఆగిశం నాగమణి పిలుపునిచ్చారు. సోమవారం ఐసిడిఎస్ గుత్తి ప్రాజెక్టు కార్యాలయంలో మున్సిపాలిటీ, రూరల్, పామిడి సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పిల్లలకు ఆధార్ కార్డులు తీయించాలన్నారు. అనంతరం మూడేళ్లలోపు పిల్లలకు పిపి1, ఐదేళ్లలోపు పిల్లలకు పిపి2 కిట్లు, పుస్తకాలను అంగన్వాడీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు నాగేశ్వరి, గౌరి, రామలక్ష్మమ్మ, లక్ష్మీనారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఉరవకొండ


కందులను పరిశీలిస్తున్న సిపిఎం, రైతుసంఘాల నాయకులు

కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం, కౌలు రైతుసంఘం, రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉరవకొండలోని మార్కెట్ యార్డులో కందులు ఆరబెట్టుకున్న రైతుల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కందులను ఎండకు వేసుకుని పడిగాపులు కాస్తున్నారన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు హామీలను ఇచ్చి నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందన్నారు. రైతులు ఆరుకాలం కష్టపడి సాగు చేసి పంటలు పండించి వాటిని అమ్ముకోవడానికి దిక్కుతోచక అయోమయ పరిస్థితిలో ఉన్నారన్నారు. నెలరోజుల నుంచి మార్కెట్ యార్డులో కందులను కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, జిల్లా నాయకులు ముష్టూరు వెంకటేసులు, రైతుసంఘం నాయకులు జ్ఞానమూర్తి, సీనప్ప, మురళి, వెంకటేశులు, వినోద్, వీరాంజనేయులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మండల పరిధిలోని ఎంఆర్‌సి కార్యాలయంలో నూతన సంవత్సర యుటిఎఫ్ క్యాలెండర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు నవీదా, లింగానాయక్ మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉపయోగపడే రీతిలో డైరీ, క్యాలెండర్లను రూపొందించడం సంతోషించదగ్గ విషయమన్నారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వివి రమణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన ఎపిజిఎల్ఐ, పిఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు అనేక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రానున్న రోజుల్లో పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి వచ్చేనెల 5, 6, 7, 8వతేదీల్లో కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను విజయవంతం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగేంద్ర, మహమ్మద్ గౌస్, పవన్‌కుమార్, మహాసభ ప్రతినిధి సీతారామిరెడ్డి, గౌరవాధ్యక్షులు హేన్రిమార్క్, శివప్రసాద్, కృష్ణమూర్తి, లక్ష్మీరెడ్డి, కలీముల్లా, ప్రసాద్, రెడ్డప్ప, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి-గుత్తి

ప్రజాశక్తి క్యాలెండర్ డైరీ, ఆవిష్కరణ

యల్లనూరు : ప్రజాశక్తి నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రాజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా ప్రజలకు చేరవేస్తూ 'ప్రతి అక్షరం-ప్రజా పక్షం వైపు'గా ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరరావు, ఆర్ఐ చిన్న నారాయణమ్మ, మండల సర్వేయర్ షర్వాణి, విఆర్ఒలు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్.వీరారెడ్డి కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుత్తి

పట్టణ శివారులో ఉన్న జెడ్. వీరారెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జడ్.వీరారెడ్డి కాలనీకు ప్రధాన రహదారి లేక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాలనీలో అంతర్గత రహదారులను నిర్మించాలన్నారు. వీధిదీపాలు, మంచినీటి సౌకర్యంతోపాటు స్పాట్ డెలివరీ ట్యాంకులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రామకృష్ణ, సి.రమేష్, కవిత, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య


రాజేష్ (పాతచిత్రం)

గుత్తి : మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పులి శేఖర్, సరోజమ్మ దంపతుల కుమారుడు రాజేష్ డిగ్రీ చదువుతున్నాడు. తనకు ద్విచక్ర వాహనం కొనివ్వలేదని మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పై కప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడి ఆత్మహత్యతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. వారి రోదన చూపరులను కంటతడి పెట్టించింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నీటికుంటలో పడి వ్యక్తి మృతి

రాయదుర్గం రూరల్ మండల పరిధిలోని 74ఉడేగోళం మధ్యానేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉన్న నీటి కుంటలో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకేసులో వ్యక్తికి ఐదేళ్లు జైలు

అనంతపురం క్రైం : హత్య కేసులో ఒకరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాల మేరకు.. బుక్కరాయసముద్రం మండలం అనంతసాగరం కాలనీకి చెందిన వినోద్‌కుమార్‌ను 2022 ఏప్రిల్ 14వతేదీ రాత్రి అదే కాలనీకి చెందిన రత్నమయ్య ఛాతీపై పొడిచి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు 2022 ఏప్రిల్ 15వతేదీ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ డి.రాము దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున 8 మంది సాక్షులను విచారించి మరూరు రత్నమయ్యపై నేరం రుజువు కావడంతో అతనికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ సంచలన తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున రాచమల్లు హరినాథ్ రెడ్డి వాదనలు వినిపించారు. కేసులో బలమైన సాక్ష్యాలు సేకరించి ముద్దాయికు శిక్ష పడేలా అప్పటి సీఐ డి.రాము కృషిచేశారు. కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ వెంకటేష్ నాయక్, ఏఎస్ఐ ఎస్.మల్లి రెడ్డి, కానిస్టేబుల్లు బి.రామమోహన్, ఎ.ప్రదీప్ కుమార్, లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు సాక్షులను కోర్టుకు హాజరు పెట్టడంలో గట్టిగా కృషి చేశారు. వీరందర్నీ ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.



నివాళులర్పిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రవీణ్‌సాయి మృతికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లా వైసిపి సోషల్ మీడియా మాజీ కన్వీనర్ ప్రవీణ్‌సాయి విట్టల్ మృతికి వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి నివాళులర్పించారు. ప్రవీణ్‌సాయి ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అనంత సోమవారం ఉదయం శారదానగర్‌లో ఉన్న ప్రవీణ్ ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. తర్వాత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-గుంతకల్లు

చేతివృత్తుల్లో నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణ తీసుకునేందుకు పట్టణంలోని మెప్మా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎసి, రిఫ్రిజిరేటర్, వాటర్‌మిషన్, వాటర్ ప్యూర్‌ఫైర్, గీజర్ వంటివి రిపేరి, వృత్తి సంబంధిత వడ్రంగి, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, సెలూన్, బ్యూటీషియన్ వంటి కోర్సుల్లో శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జనవరి 4వతేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 94935 36176, 94935 36504 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పాఠశాలకు రూ.20వేలు విరాళం

రాప్తాడు : మండల కేంద్రంలోని హైస్కూల్ అభివృద్ధికి ఎంపిడిఒ విజయలక్ష్మి సోమవారం రూ.20వేలు విరాళంగా అందజేశారు. ఈ మధ్యకాలంలో నిర్వహించిన తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో పాఠశాల అభివృద్ధికి రూ.20వేలు విరాళం అందజేయనున్నట్లు ఎంపిడిఒ ప్రకటించారు. ఇచ్చిన హామీ మేరకు సంబంధిత నగదును ఉపాధ్యాయులు, సర్పంచి సమక్షంలో అందజేశారు.

2 నుంచి గ్రామసభలు

నార్పల : మండలవ్యాప్తంగా వచ్చేనెల 3వతేదీన ఉంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ గంగావతి, ఇఒఆర్‌డి శైలజారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామసభల్లో నాటి స్థితిగతులు, సాధించిన ప్రగతిపై శాఖల వారీగా సమీక్ష చేయనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల్లో జరిగిన సోషల్ ఆడిట్‌పై నివేదిక సమర్పించాలన్నారు. వీటికితోడు అనేక సమస్యలపై సమీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

వసతి గృహాలకు నూతన భవనాలను నిర్మించాలి

ప్రజాశక్తి-గుత్తి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వ వసతిగృహాలకు సంబంధించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటి స్థానంలో నూతన భవనాలను నిర్మించాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ డి.ఓబిలేసుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల భవనాలు సమస్యల వలయంలో ఉన్నాయన్నారు. కావున ఆయా వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మోహన్‌నాయక్

కుల ధ్రువపత్రాల పంపిణీలో అక్రమాలు అరికట్టాలి

ఎపి ఎరుకల సేవాసంఘం రాష్ట్ర కార్యదర్శి కొలేగుండ్ల శేఖర్

ప్రజాశక్తి-ఉరవకొండ



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎరుకల సేవాసంఘం నాయకులు

ఎస్‌టి కుల ధ్రువపత్రాల పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని ఎపి ఎరుకల సేవాసంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్ కోరారు. సోమవారం ఎపి ఎరుకల సేవాసంఘం ఆధ్వర్యంలో ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ అధ్యక్షుడు సాకే వసంత్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర కులాలకు చెందిన వ్యక్తులు తప్పుడు ధ్రువపత్రాలు జత చేసి రెవెన్యూ శాఖలో ఎస్‌టి కుల ధ్రువపత్రాలు పొందుతున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎరుకల సేవాసంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గంగన్న, సెక్రటరీ వై.నరసింహులు, పట్టణ అధ్యక్షుడు వీరేంద్ర, ప్రధాన కార్యదర్శి వై.హనుమంతు, సోమశేఖర్, మైసూర్ గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు

ప్రజాశక్తి-ఉరవకొండ



పప్పుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

సాగులో రైతులు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి శుభకర్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని రేణుమాకులపల్లి, నింబగల్లు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పప్పుశనగ పొలాలను పరిశీలించారు. ఇందులో భాగంగా రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ ప్రస్తుతం పప్పుశనగ పంటలో విల్ట్ తెగులు, ఎండు తెగులు కనబడుతోందన్నారు. కావున రైతులు కాంటాక్ట్ ఫ్లస్ (హెక్స కొనజోల్) రెండు ఎంఎల్ లీటర్ నీటికి లేదా కవచ్ (క్లోంతనిల్) 2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేస్తే తెగులును నివారించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవాకేంద్ర సిబ్బంది అక్షిత, హేమ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-పుట్లూరు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు సర్పంచి శివరామయ్య ఆధ్వర్యంలో మండలంలోని చింతకుంట, కందికాపుల గ్రామాల్లో చేపట్టిన టిడిపి సభ్యత్వ నమోదు రెండోరోజు సోమవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా సర్పంచి శివరామయ్య సొంత ఖర్చులతో 250మందితో సభ్యత్వం చేయించారు. ఈకార్యక్రమంలో టిడిపి శ్రేణులు సూర్యనారాయణ, భగవత్, నాగేశ్వరరెడ్డి, శివారెడ్డి, వెంకటరామిరెడ్డి, కృష్ణ, ఇంద్ర, ఎస్.నాగేశ్వరరెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'పరిష్కార వేదిక'కు 3 దరఖాస్తులు



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ రాజా

యల్లనూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మూడు దరఖాస్తులు వచ్చినటుల తహశీల్దార్ రాజా తెలిపారు. ఇందులో భూములకు సంబంధించిన సమస్యలపై వినతులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, ఆర్ఐ చిన్న నారాయణమ్మ, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీగా శెట్టిపి జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీగా శెట్టిపి జయచంద్రారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం అనంతపురం నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి ధర్మవరం పట్టణానికి చెందిన శెట్టిపి జయచంద్రా రెడ్డిని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



నూతన కమిటీ సభ్యులకు కండువాలు కప్పుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్దు తెలిపారు. సోమవారం ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పని చేస్తుందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం 18 మందితో మండల నూతన పట్టణ కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నందు, కార్యదర్శిగా హరున్ రషీద్, ఉపాధ్యక్షులుగా రాజేష్, వెంకీ, సాగర్, అభి, సహాయ కార్యదర్శులుగా నవీన్, అశోక్, సురేష్, కమిటీ సభ్యులుగా, 12 మంది ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

బయోమెట్రిక్ సదుపాయం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని పెన్షనర్ భవన్‌లో జనవరి 1వతేదీ నుంచి పెన్షనర్ల సౌకర్యార్థం బయోమెట్రిక్ సదుపాయం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ రాయదుర్గం అధ్యక్షులు ఇ.రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది జనవరిలో వార్షిక తనిఖీకై లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అందుకోసం పెన్షనర్ భవన్‌లో జనవరి మొదటి తేదీ నుండి బయోమెట్రిక్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బయోమెట్రిక్ సిస్టం ద్వారా సబ్ ట్రెజరీ ఆఫీసుకు లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాల్సిన పెన్షనర్లు తమ వెంట వారి ఆధార్ కార్డు, పాన్ కార్డు, కలర్ ఫొటో, ఫోన్ నెంబర్, ఐడి నెంబర్, బ్యాంకు పాస్ పుస్తకం తీసుకురావాలని కోరారు.

నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి-గుత్తి



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న అధికారులు

పట్టణంలోని కోట ప్రాంతంలో ఏపీఎస్పీడీసీఎల్ సోమవారం 160 కెవిఎ నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం రాత్రి మరమ్మతులకు గురైంది. దీంతో నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను లైన్ ఇన్స్పెక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్, లైన్ మాన్లు ఏర్పాటు చేశారు. ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పప్పుశనగ రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని పప్పుశనగ పంట సాగు చేసిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కౌలు రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కందికాపుల, చింతకుంట గ్రామాల్లో సాగు చేసిన పప్పుశనగ పంటలను ఎపి రైతుసంఘం, కౌలు రైతుసంఘాల నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వీటి రామాంజనేయులు, రైతు సంఘం మండల కార్యదర్శి సత్తార్ గోపాల్ యాదవ్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో పప్పుశనగ పంట సాగు చేసిన రైతులు ఆకాల వర్షాలు, తుఫాన్ల కారణంగా నష్టపోతున్నారన్నారు. కావున ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం సీనియర్ నాయకులు యల్లనూరు రామచంద్రారెడ్డి, మండల గౌరవాధ్యక్షులు టి.బాలగంగ్రయ్య, ఉపాధ్యక్షుడు బుసగాని చిన్నకృష్ణుడు, రైతుసంఘం జిల్లా నాయకులు ఎన్.గోపాలకృష్ణ, రైతుసంఘం మండల నాయకులు ఎ.చిన్నకుళ్లాయప్ప, రైతులు ప్రసాద్, ఆంజన కుళ్లాయప్ప, రాజు, తదితరులు పాల్గొన్నారు.



పప్పుశనగ పంటను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు